లోక కల్యాణం కోసం మహా కుంకుమార్చన

● హాజరైన బీజేపీ ప్రముఖులు



మహా కుంకుమార్చనలో కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, చింతల, దీపక్‌రెడ్డి



విద్యాదశ కోటి మహాకుంకుమార్చనలో దత్తాత్రేయ



విజయలక్ష్మి అమ్మవారికి దీపారాధన చేస్తున్న మహిళలు

బంజారాహిల్స్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీ విద్యా దశ కోటి మహా కుంకుమార్చన పూజలు శనివారం శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పూజాధికాలు నిర్వహించారు. వారణాసి నుంచి వచ్చిన స్వామీ అభిషేక్ బ్రహ్మచారి పర్యవేక్షణలో ఈ కుంకుమార్చన పూజలు మూడు రోజులపాటు జరుగుతాయని నిర్వాహకులు సింధూరపు కృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ అమ్మవారి స్తోత్రాలను పఠించినా, పలికినా ఆ ప్రాంతాల్లో మంచి జరగడంతో పాటు ప్రజలు సుభిక్షంగానూ, ఆయురారోగ్యాలతోనూ ఉంటారని అన్నారు. లోక కల్యాణం కోసం చేసే ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వేలాది మంది మహిళలు పాల్గొంటున్నారని తెలిపారు. రాజరాజేశ్వరి దేవీ, లలితా త్రిపుర సుందరీ దేవీ అమ్మవార్లకు కుంకుమార్చనల్లో భాగంగా స్తోత్రాలను 100 కోట్ల సార్లు దేశమంతా పలికించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని స్వామీజీ నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికే 27 సార్లు ఈ కార్యక్రమాలు నిర్వహించారని నిర్వాహకులు తెలిపారు. నగరంలో జరిగే కుంకుమార్చనల్లో సుమారు నిత్యం వెయ్యి మంది పాల్గొని 10 కోట్ల సార్లు అమ్మవారి స్తోత్రాలను పలుకుతారని యువ చేతన నేషనల్ కన్వీనర్ రోహిత్ కుమార్ సింగ్ వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహా కుంకుమార్చనలో వెయ్యి మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు అన్వేష్, అనంతలక్ష్మి, కరాటే కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణమాస విశేష మహోత్సవాలు

ఎర్రగడ్డ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీ విజయలక్ష్మి ఆలయంలో ప్రతీ సంవత్సరం శ్రావణమాసంలో నిర్వహించే శ్రావణ మాస విశేష మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలను శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనములతో నిర్వహించారు. అర్చకులు వంశీకృష్ణ ప్రతీ రోజు భక్తులను ఉద్దేశించి ఉపన్యాసాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చింతల రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎం.వి.రెడ్డి, అర్చకులు గట్టు రంగాచారి, నరసింహ, మేనేజర్ మల్లేష్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘాల నాయకులు

గౌడ్‌లకు మద్యం దుకాణాలలో
25 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే

పంజాగుట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో గౌడ సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను అమలు వెంటనే అమలు చేయాలని,తెలంగాణ కల్లు, గీత సొసైటీలకు మద్యం దుకాణాల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందిచకపోతే 25 నుంచి సమస్య పరిష్కారమయ్యే వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఆయిలి వెంకన్నగౌడ్ అధ్యక్షతన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్, వివిధ గౌడ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మద్యంలో దుకాణాలలో గౌడ సామాజిక వర్గానికి 15 శాతం రిజర్వేషన్లు అమలు చేశామని, వాటిని 30 శాతానికి పెంచే ఆలోచన ఉన్న క్రమంలో ఎన్నికలు వచ్చి అమలు చేయలేక పోయామన్నారు. సమావేశంలో గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్, గడీల కుమార్‌గౌడ్, అనంతరాజుగౌడ్, దామోదర్‌గౌడ్, చీకటి ప్రభాకర్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, భైరు శేఖర్, టి.శ్రీశైలంగౌడ్, జి.వెంకటేష్‌గౌడ్, బి.బిక్షపతి, వేములయ్య, సదానందంగౌడ్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

శివబాగ్‌లో పార్కు స్థలం కాలనీకే : తలసాని

అమీర్‌పేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శివబాగ్ కాలనీలో పార్కు స్థలం కాలనీకే చెందుతుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. తమ కాలనీలోని పార్కు స్థలాన్ని కొందరు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కాలనీ ప్రతినిధులు శుక్రవారం తలసానికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి శివబాగ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీకి చెందిన పార్కు స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని, అవసరమైతే కాలనీ వాసులతో కలిసి ఆందోళన చేపట్టడానికి సిద్ధమని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, డీసీ జయంత్, డీఈ వాసుదేవరెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం ప్రభాకర్, హార్టికల్చర్ అధికారి జ్యోత్స్న, హన్మంతరావు, శివబాగ్ కాలనీ ప్రతినిధులు రాజు, సంజీవరావు, రాంనివాస్ బన్సాల్, సుబ్బయ్య, అనిల్ చౌదరి తదితరులు ఉన్నారు.



ప్రజాశాంతి పార్టీ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కేఏ పాల్

ఉప ఎన్నికలో ప్రజాశాంతి పార్టీ పోటీ : కేఏ పాల్

యూసుఫ్‌గూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజాశాంతి పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజాశాంతి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం శనివారం మహమూద్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా కేఏ పాల్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజాశాంతి పార్టీ గెలుపునకు అందరూ సమష్టిగా కృషి చేయాలని వారికి సూచించారు. 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అభివృద్ధి పాఠాలు నేర్పింది, బాబు పాలనలో అడవి లాంటి హైదరాబాద్‌కు 100 కంపెనీలను తీసుకొచ్చి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత' తనదే అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నెల్సన్ బిజినెస్ స్కూల్ స్నాతకోత్సవంలో డాక్టర్ ఎస్‌కే జోషి, నిర్వాహకులు

కొత్త ప్రయాణానికి పట్టుదల, నిజాయితీ అవసరం

● మాజీ సీఎస్ డాక్టర్ ఎస్‌కే జోషి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ముగింపు కాదని.. కొత్త ప్రయాణానికి ఆరంభమని.. కొత్త ప్రయాణానికి పట్టుదల, నిజాయితీ, బాధ్యత అవసరమని మాజీ సీఎస్ డాక్టర్ ఎస్‌కే జోషి అన్నారు. బంజారాహిల్స్‌లో నిర్వహించిన నెల్సన్ బిజినెస్ స్కూల్ స్నాతకోత్సవంలో విద్యార్థులకు ఆయన పట్టాలు అందజేశారు. ప్రజల్లో పెరుగుతున్న అసహనం, యుద్ధాలు, ఆర్థిక మందగమనం వంటి అంశాలను ప్రస్తావించి, కృత్రిమ మేధ మన జీవన విధానాన్ని, పారిశ్రామిక విధానాన్ని వేగంగా మార్చేస్తున్నాయని, ఈ మార్పులకు సిద్ధంగా ఉండాలని సూచించారు. నెల్సన్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ త్రిమూర్తి ఒడురి మాట్లాడుతూ డిప్లమా, బీబీఏ, ఎంబీఏ డాక్టరేట్ ప్రోగ్రామ్‌లలో 120 మంది విద్యార్థులు పట్టాలు పొందారన్నారు. కార్యక్రమంలో నెల్సన్ బిజినెస్ స్కూల్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ యాత్రకు మద్దతుగా పాదయాత్ర

పంజాగుట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరీ అనేది చాలా పెద్ద నేరమని హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు సీపీ వేణుగోపాలస్వామితో కలిసి ఆయన మాట్లాడారు. ఓటు చోరీ నేపథ్యంలో లోక్ సభలో కాంగ్రెస్ పార్టీ పక్ష నేత రాహుల్ గాంధీ బిహార్‌లో చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఈనెల 24 నుంచి నాలుగు రోజులపాటు పాదయాత్ర చేస్తామని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కూడా బోగస్ ఓట్లు ఉన్నాయని వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

వ్యభిచార కేంద్రంపై దాడి.. ముగ్గురి అరెస్టు

అమీర్‌పేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓ కేంద్రంపై ఎస్ఆర్ నగర్ పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. ఎస్సై రాజు రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట ఆదిత్యా ఎన్‌క్లేవ్‌లోని ఓ బ్లాక్‌లోని ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై రాజు రాథోడ్, సిబ్బంది శనివారం సాయంత్రం ఆకస్మికంగా దాడి చేశారు. వ్యభిచార కేంద్రం ఉప నిర్వాహకుడైన ప్రభుతో పాటు ఓ యువతిని, విటుడిగా వచ్చిన మరో యువకుడిని అరెస్టు చేశారు. యువతిని పునరావాస కేంద్రానికి తరలించారు. మిగిలిన ఇద్దరు నిందితులను రిమాండ్‌కు పంపారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

● మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్



నటరాజ్ నగర్‌లో పర్యటిస్తున్న మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్

ఎర్రగడ్డ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని నటరాజ్ నగర్, నేతాజీ నగర్, ఓల్డ్ నటరాజ్ నగర్ తదితర బస్తీల్లో ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 10 సంవత్సరాలు తాను ఎంపీగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్‌ను కూడా ఎంతో అభివృద్ధి చేశానన్నారు. దివంగత నేత జనార్దన్‌రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రజల చేత 'అన్నా అంటే నేనున్నా' అని అనిపించుకున్న నేత అని కొనియాడారు. రానున్న ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్ మొహసిన్ ఖురేషి, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణ కుమార్, నాయకులు రమేష్ నాయక్, భాస్కర్, రామ్‌చందర్, సలీం, ఖాదర్, బాలరాజు పాల్గొన్నారు.

మట్టి గణపతిని ప్రతిష్ఠించాలి : వెంకయ్యనాయుడు




వెంకయ్యనాయుడుకి మట్టి విగ్రహాన్ని అందజేస్తున్న వాసవీ యువజన సంఘం ప్రతినిధులు

బంజారాహిల్స్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో శనివారం వాసవీ యువజన సేవా సంఘం మొదటి మట్టి గణపతిని ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘం ప్రతినిధులు పుట్టా రామకృష్ణ, అట్లూరి రామకృష్ణ, ఎ.సూర్యారావు, ఎస్.శ్రీనివాస్‌రావు, పుట్టా ప్రసాద్‌బాబు, పుట్టా బుజ్జి, పూర్ణనాగేశ్వరరావు, నవీన్, సర్వారావు, అనిల్, రంజిత్, రాంజీ, లక్ష్మీరావు, శ్రవణ్, మణి, సతీష్, నరేష్, నవీన్, కేడ్గర్ రామ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆటంకాలు ఏర్పడకుండా చూడాలి

బంజారాహిల్స్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల వల్ల ట్రాఫిక్ ఆటంకాలు ఏర్పడకుండా చూడాలని పశ్చిమ మండలం డీసీపీ రాహుల్ హెగ్డే అన్నారు. ఫిలింనగర్, బంజారాహిల్స్, షేక్‌పేట, పంజాగుట్ట ప్రాంతాల్లో ప్రధాన రోడ్ల వద్ద ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాలను శనివారం ఆయన ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ ఆటంకాల గురించి సిబ్బందితో చర్చించారు.



మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు ఆహ్వానం

ఖైరతాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు ప్రముఖులను శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆహ్వానిస్తున్నారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు ఈటల రాజేందర్, ఆర్.కృష్ణయ్య, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు పలువురు ప్రముఖులకు ఆహ్వానం అందజేశారు.

46వ సామూహిక గణేశ్ ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

పంజాగుట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నేతృత్వంలో భాగ్యనగర్‌లో నిర్వహించే 46వ సామూహిక గణేశ్ ఉత్సవాలకు ఘనమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ విభాగాల సమన్వయం, సహకారంతో ఈ సంవత్సరం జీహెచ్ఎంసీ, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో గణేశ్ ఉత్సవాలకు, నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ శశిధర్ రావినూతల, కార్యదర్శి జి.మహేందర్, ఉపాధ్యక్షులు ఎం.వైకుంఠం, గోవింద్ రాఠి, కోశాధికారి శ్రీరామ్ వ్యాస్‌తో కలిసి వినాయక చవితి ఉత్సవ వేడుకలు, పాటల సీడీ, పాటల పుస్తకం, వెబ్‌సైట్, స్వదేశీ-విదేశీ ఉత్పత్తుల జాబితా కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సంవత్సరం 1.40 లక్షల మండపాలు ఏర్పాటవుతాయని అంచనా అని, 27న గణేశ్ ఉత్సవాలు ప్రారంభమై అనంత చతుర్దశి రోజు సెప్టెంబరు 6న సామూహిక నిమజ్జనం ఉంటుందని తెలిపారు. విగ్రహాల నిమజ్జనం కోసం మూడు కమిషనరేట్ల పరిధిలో చెరువులు, కుంటలు, బేబీ పాండ్స్ వద్ద ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. అన్ని విభాగాలతో సమన్వయంతో 303 కిలోమీటర్ల పరిధిలో 160 గణేశ్ యాక్షన్ టీమ్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు చిన్న గణపతిని పూజించాలి

● ఆకట్టుకున్న సంస్కార్ ది లైఫ్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శనలు



ఎర్రగడ్డ వీధుల్లో చిన్న గణపతిని పూజించాలని ప్లకార్డులు, నృత్యాలతో ప్రదర్శనలు ఇస్తున్న సంస్కార్ ది లైఫ్ స్కూల్ చిన్నారులు

ఎర్రగడ్డ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): 'చిన్న గణపతిని పెద్ద మనసుతో పూజిద్దాం.. పెద్ద గణపతి వద్దు చిన్న గణపతి ముద్దు.. గణపతి చోటా హోనా చాహియే, దిల్ బడా రెహనా చాహియే..' అనే ప్లకార్డులు, నినాదాలతో శనివారం సంస్కార్ ది లైఫ్ స్కూల్ విద్యార్థులు ఎర్రగడ్డలోని వీధుల్లో నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ ప్రత్యేకంగా ఆకర్షించాయి. ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌కు చెందిన సుమారు 100 మంది చిన్నారులతో సాగిన ఈ ప్రదర్శనలు వీధుల వెంట చూపరులను ప్రత్యేకంగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా స్కూల్ ఫౌండర్ సీఈవో ఏ మోహన వంశీ మాట్లాడుతూ దేవలోకంలో లేని అందాలను సైతం సృష్టించి భగవంతుడు ఆ అందాలను మనకు ప్రసాదించాడని, వాటిని మరింత అందంగా తీర్చిదిద్దుకోవడం కోసం చక్కగా కాపాడుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. అటువంటి బాధ్యతను విస్మరించి ప్రకృతిని నిర్లక్ష్యం చేసి ఈరోజు మనం ప్రకృతిని ధ్వంసం చేస్తున్నామన్నారు. ఇది ఇలాగే కొనసాగితే కొంతకాలానికి మనకు మిగిలేది నిర్జీవమైన భూమి మాత్రమేనని, ఇకనైనా మేలుకొని మనం ప్రకృతి పరిరక్షణకు పూనుకోవాలని పేర్కొన్నారు. అందుకు చిన్న గణపతులు, మట్టి గణపతిని పూజించడానికి ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

బంజారాహిల్స్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి అన్నారు. సైబర్ క్రైమ్ నేరాలపై నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఏసీపీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఒకవేళ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేయడం వల్ల పోగొట్టుకున్న డబ్బులు తిరిగి వస్తాయని పేర్కొన్నారు. ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం మాట్లాడుతూ ఏపీకే ఫైల్స్ ఎట్టి పరిస్థితిలో డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో ఫొటోలు, వ్యక్తిగత వివరాలు అప్‌లోడ్ చేయవద్దని తెలిపారు. సోషల్ మీడియా ఖాతాల పాస్ వర్డు ఇతర వివరాలు దగ్గర స్నేహితులకు సైతం ఇవ్వవద్దని హెచ్చరించారు. యువత సమయ స్ఫూర్తిగా వ్యవహరిస్తూ సైబర్ నేరాలను అరికట్టాలని సూచించారు. క్రిప్టో కరెన్సీ వంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ పల్లవి, కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ఖైరతాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) కోరింది. శనివారం తపస్ హైదరాబాద్ అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి జి.వీరేష్ నేతృత్వంలో ప్రతినిధులు కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులను మోసగిస్తూ ఆగస్టు 23, 2014 రోజున చీకటి జీవోను విడుదల చేసిందని, దీని ప్రకారం 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారందరికీ కొత్త సీపీఎస్ పెన్షన్ విధానాన్ని వర్తింపజేశారని తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేసి పాత విధానాన్ని అమలులోకి తెస్తామని హామీ ఇచ్చారని, దానిని వెంటనే అమలు చేయాలని కోరారు. ఇందులో ప్రతినిధులు వీరకుమార్, అరవింద్, మల్లేశం తదితరులు ఉన్నారు.



మహిళా సమాఖ్య సభ్యులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి, వెంకట్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఎన్‌బీటీనగర్‌కు చెందిన మహిళలు

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

మధ్యతరగతి మహిళలంతా పొదుపు సంఘాల్లో చేరాలి

బోరబండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మధ్యతరగతి మహిళలంతా పొదుపు సంఘాల్లో చేరాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్పీఆర్ హిల్స్‌లో మహిళా పొదుపు సంఘాల ప్రతినిధులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పొదుపు సంఘంలో చేరడం అంటే కేవలం బ్యాంక్ రుణాల కోసమే కాదని, సాధికారిత సాధనలో అదొక ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. కార్య క్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి మాజీ అధ్యక్షుడు డా.ఎన్.గౌతమ్‌రావు, కిలారి మనోహర్, అట్లూరి రామకృష్ణ, కొలన్ సత్యనారాయణ, షర్మిల జాదవ్, టి.లక్ష్మణ్, సుప్రియగౌడ్, కళమ్మ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాగంటి గోపీనాథ్ సంస్మరణ సభ



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రవీందర్‌రావు

బోరబండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంస్మరణ సభ ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నారు. సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు శనివారం పరిశీలించారు. మాగంటి భార్య సునీతతో పాటు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, బీఆర్ఎస్ ప్రముఖులు సభకు హాజరవుతారని ఆయన తెలిపారు. దాదాపు 3వేల మందికి కానుకలు అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎమ్మెల్సీ వెంట పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

గ్యాస్ సిలిండర్లు చోరీ.. నిందితుడి అరెస్టు

అమీర్‌పేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పిజ్జా హౌస్‌లో గ్యాస్ సిలిండర్లు చోరీ చేసిన దొంగను ఎస్సార్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లికి చెందిన రామకృష్ణారెడ్డి(23) గ్యాస్ సిలిండర్లను చోరీ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఉదయం పూట హోటళ్లు, పిజ్జా హౌస్ ఉన్న పరిసరాల్లో రెక్కీ నిర్వహిస్తూ మరుసటి రోజు తెల్లవారుజామున చోరీలకు పాల్పడేవాడు. షెట్టర్లు తెరిచి లోనికి చొరబడి రామకృష్ణారెడ్డి రెండు గ్యాస్ సిలిండర్ల చొప్పున దొంగిలించుకుపోయేవాడు. గతంలో బాచుపల్లి, ఎస్ఆర్ నగర్, జగద్గిరిగుట్ట ఠాణాల పరిధిలో చోరీలకు పాల్పడ్డాడు. ఇటీవల బాపూనగర్‌లోని డొమినోస్ పిజ్జా హౌస్ నుంచి సిలిండర్లను చోరీ చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల సాయంతో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు : ఏసీపీ

మారేడుపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజుల పాటు జరిగే గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి గొడవలు సృష్టించకూడదని గోపాలపురం డివిజన్ ఏసీపీ సుబ్బయ్య రౌడీ షీటర్లను హెచ్చరించారు. శనివారం సికింద్రాబాద్‌లో జరిగిన సమావేశంలో వారితో ముఖాముఖీ చర్చించారు. గోపాలపురం, మారేడుపల్లి, తుకారంగేట్ ప్రాంతాల్లోని రౌడీషీటర్ల అందరిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ ఉత్సవాల్లో గొడవలు సృష్టిస్తే ఎవరైనా సరే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. పండుగలను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని రౌడీషీటర్లు ఎక్కడ పడితే అక్కడ గొడవలు పాల్పడదని హెచ్చరించారు. ఈ సమావేశంలో తుకారంగేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మారేడుపల్లి ఇన్స్పెక్టర్ వెంకటేష్, గోపాలపురం ఇన్స్పెక్టర్ మధుకుమార్, లతోపాటు సమావేశంలో రౌడీషీటర్లు పాల్గొన్నారు.



మండప నిర్వాహకులతో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ ఏసీపీ శశాంక్ రెడ్డి

మండప నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

అడ్డగుట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వినాయక పండుగను కుల మతాలతీతంగా జరుపుకోవాలని ఈస్ట్ జోన్ ఏసీపీ శశాంక్ రెడ్డి మండప నిర్వాహకులకు సూచించారు. శనివారం లాలాగూడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ మండప నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రతి మండప నిర్వాహకులు పోలీసులు ఆదేశాలు పాటిస్తూ, వారికి పూర్తి సహకారాలు అందించాలని కోరారు. మీ ప్రాంతాల్లో ఏదైనా ఘటన జరిగితే వెంటనే పోలీస్ కంట్రోల్ రూం, మీ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు రాత్రి మండపాల వద్ద ఎవరైనా కమిటీ సభ్యుడు ఉండాలని తెలిపారు. మధ్యరాత్రి వరకు మండపాల వద్ద డీజేలను నిషేధించామని, సౌండ్ పోల్యూషన్ ఫిర్యాదులు వస్తే మాత్రమే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో లాలాగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు, డీఐ రామకృష్ణ, ఎస్సైలు సురేష్, లింగరాజు, నాగరాణి, యుగేందర్, గణేష్‌లతో పాటు మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు ప్రొ. జయశంకర్ స్మారకోపన్యాసం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర స్వప్న సాధకుడు, మార్గదర్శకుడు ప్రొఫెసర్ జయశంకర్ 14వ వర్ధంతి నేపథ్యంలో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో 14వ స్మారకోపన్యాసం సభను ఆదివారం నిర్వహించనుంది. ఓయూ ఇంజనీరింగ్ కాలేజీలోని ఈసీఈ ఆడిటోరియంలో జరగనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విలువలు కలిగిన ఆలోచన విధానంతో తెలంగాణ రాష్ట్ర కల సాకారం కోసం తన జీవితాంతం కృషిచేసిన మహనీయులు ఆయన అని అన్నారు. జన వికాసం కోసం విద్యావంతులు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు డాక్టర్ ఇ.ఉపేందర్ రావు, డాక్టర్ దుబ్బ రంజిత్, డాక్టర్ ఆరుట్ల జానకి రెడ్డి, డాక్టర్ కాటేపాగా యుగేందర్, డాక్టర్ తాళ్ల అజయ్, డాక్టర్ ఎడ్ల అంజయ్య, పీడీఎస్‌యూ నాయకులు ఆసిఫ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

ఆలయంలో ప్రత్యేక పూజలు

బౌద్ధనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆఖరి శ్రావణ శనివారం కావటంతో నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణ వెంకటేశ్వరస్వామి వారిని వివిధ పుష్పగుచ్ఛాలతో సుందరంగా అలకరించారు. సభ్యులు బిట్ల రఘునందన్‌కుమార్, నాలుగూరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

అడ్డగుంతల రోడ్లు!

ప్రమాదకరంగా అడ్డగుట్ట.. తుకారాంగేట్ రోడ్లు

చిన్నపాటి వర్షానికే చిత్తడి

మరమ్మతులకు దూరంగా జీహెచ్‌ఎంసీ సిబ్బంది

అడ్డగుట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నపాటి వర్షానికే పాడైపోతున్న రోడ్లు, కంకర తేలిన ప్రధాన రోడ్ల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గత పది రోజులుగా కురుస్తున్న వర్షానికి తుకారాంగేట్ అడ్డగుట్ట ప్రాంతంలో రోడ్లు పాడైపోతున్నా బాగు చేయడానికి ఎవరు ముందుకు రావడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. అడ్డగుట్ట మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి వెంకట్‌నగర్ బస్తీలో రోడ్లు కంకర తేలి ప్రమాకరంగా మారాయి. వర్షం పడితే చాలు మ్యాన్‌హోళ్లు నిండిపోయి మురుగు ఇళ్లలోకి చేరుతుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. తుకారాంగేట్ సుభాష్ విగ్రహం, గడ్డమీదిబస్తీ, లాలాగూడ రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.



ప్రమాదకరంగా మారిన ఆర్‌ఆర్‌ఈ మైదానం వద్ద రోడ్డు

శాస్త్రినగర్‌లో..

చిన్నపాటి వర్షానికే శాస్త్రినగర్ బస్తీలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనేకసార్లు ఇక్కడ ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు మార్చాలని పలుమార్లు నాయకులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదు. దాంతో ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న జేఎస్‌జేఎస్‌ఆర్‌ఎం అపార్ట్‌మెంట్ వైపున ఉన్న బస్తీలో చిన్నపాటి వర్షానికి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.



శాస్త్రినగర్‌లో పగిలిపోయిన రోడ్డు



శాస్త్రినగర్‌లో మ్యాన్‌హోల్‌లోకి చేరుతున్న వర్షం మురుగు నీరు

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట కమ్యూనిటీహాలు వెనుకవైపున ఉన్న ఆర్ఆర్‌సీ మైదానం వద్ద మొండిబండనగర్ కాలనీ వైపు వెళ్లే రోడ్డులో వర్షం నీరు ఏరులై పారుతున్న పక్కనే ఉన్న నాల పనులు క్లీన్ చేయకపోవడంతో రోడ్లపైకి వర్షం నీరు చేరుకుని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అడ్డగుట్టలో దాదాపు వందకు పైగా బస్తీలు కాలనీలు ఉన్నప్పటికి వర్షం వస్తే చాలు అడ్డగుట్ట ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తుకారాంగేట్, అడ్డగుట్ట ప్రాంతాల్లో ఉన్న నాలాలు, మ్యాన్‌హోళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే వర్షం వచ్చిన సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. జీహెచ్‌ఎంసీ వారు మ్యాన్‌హోళ్లు శుభ్రపరిచిన అనంతరం మట్టిని పక్కనే వేయడం, ఆ తర్వాత ఎవరు తీయకపోవడంతో వర్షం పడితే మట్టి అదే మ్యాన్‌హోల్ లోపలికి పారుతుందని అనేక సార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదు.

పట్టించుకోని కార్పొరేటర్

అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఒక వైపు విపత్తు జరిగిన ప్రదేశంలో ఎక్కడా కనిపించడంలేదనిప్రజలు ఆరోపిస్తున్నారు. ఆమె శంకుస్థాపనలకే పరిమితమవుతుందని మహిళలు ఆరోపిస్తున్నారు. ఆర్‌ఆర్‌సి మైదానం వద్ద ఉన్న ప్రాంతాలతో పాటు మొండిబండనగర్ గుడిసెల్లో ఉంటున్న ప్రజలు వర్షంతో ఇబ్బందులు పడుతుంటే సమస్యలు తెలుసుకునేందుకు రాలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు



వర్షానికి మట్టిదిబ్బగా మారిన వెంకట్‌నగర్ రోడ్డు



రోడ్డుకు అడ్డంగా ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ జాలీ

మరమ్మతులు చేయండి



పాడైపోయిన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయకపోవడంతో వర్షపునీరు మ్యాన్‌హోల్‌లోకి వెళ్లి తాగునీటి పైప్‌లైన్‌లో కలిసిపోతుంది. శాస్త్రినగర్ బస్తీలో తీవ్రమైన సమస్య ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదు ఇప్పటికైనా సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అధికారులు పర్యటించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

- నక్కల శోభ (రుద్రవీణ మహిళా మండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు)

సమస్యను పరిష్కరించండి



అడ్డగుట్ట డివిజన్‌లో పాడైపోయిన రోడ్లకు మరమత్తులు చేయండి, డివిజన్‌లో తుకారాంగేట్ శాస్త్రినగర్ వెంకట్‌నగర్ మొండిబండ నగర్, మరాఠబస్తీ ఆర్‌ఆర్‌సి మైదానం వెళ్లే రోడ్లలో కనీసం బైకులపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. డివిజన్‌లో తలెత్తిన సమస్యలపై ఆయా శాఖల అధికారులు పర్యటించి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- శ్యామల లక్ష్మి

కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్టు స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శనివారం కంటోన్మెంట్ మూడో వార్డులోని మడ్‌ఫోర్డులో ఆయన బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికిగాను అప్పటికప్పుడే కొందరు అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ నాయకులు నిర్లక్ష్యం వల్ల కంటోన్మెంట్ అభివృద్ధి జరగలేదని, అందుకే తాను చొరవ తీసుకుని, సీఎం సహకారంతో దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తున్నట్టు వెల్లడించారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మద మల్లిఖార్జున్

బోర్‌వెల్ పనులు

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులతో మడ్‌ఫోర్డులోని కంటోన్మెంట్ క్వార్టర్స్ ఏరియాలో చేపట్టిన బోర్‌వెల్ పనులను శనివారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మదతో కలిసి శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు.

మారేడుపల్లిలో..

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 4వ వార్డులో రాందాస్ గార్డెన్, పిట్టలనగర్‌లో బోర్డు నిధులు రూ.40 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను శనివారం కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మద మల్లిఖార్జున్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భానుక నర్మద మాట్లడుతూ గత అయిదు నెలల్లో 4వ వార్డులో సుమారు రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ వార్డ్ అధ్యక్షులు సచిన్, నాయకులు టోపి శంకర్, విజానంద్, నాగభూషణం రెడ్డి, ప్రేమ్ కుమార్, రాజ్ మల్లేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదాన శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బ్రహ్మాకుమారీస్ ప్రతినిధులు

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం మరొకరికి ప్రాణదానమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్ మారేడుపల్లిలోని బ్రహ్మ కుమారీస్ భవనంలో శనివారం సికింద్రాబాద్ బ్రాంచ్ ఇన్‌చార్జి మంజు దీదీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సుమారు 250 మంది శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఇందులో 50 మంది సైనికులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. దాది ప్రకాష్ మణి పుణ్యతిథి సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న 8 వేల బ్రహ్మకుమారి సెంటర్లలో 25వ తేదీ వరకు శిబిరాన్ని నిర్వహిస్తారు. ఇలా సేకరించిన రక్తాన్ని ఆరట్వి హాస్పిటల్ బ్లడ్ సెంటర్(చారిటబుల్ ట్రస్ట్)కు అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో (సిఎస్‌సి) డిఐజి ఎస్‌జెడ్ ఖాన్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షిణి, ప్రముఖ డాక్టర్ గండయ్య, డాక్టర్ రాజకుమార్ బ్రహ్మకుమారిస్ ప్రతినిధులు సత్యనారాయణ, మమత, సిస్టర్స్, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆడబిడ్డ పెళ్లి అంటే ఆర్థికంగా ఎంతో భారంతో కూడుకున్న విషయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాలానగర్ మండల పరిధిలోని 15 మంది లబ్దిదారులకు షాదీముబారక్ కింద మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సనత్‌నగర్, బేగంపేట కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మీ, టి.మహేశ్వరి, ఆర్‌ఐ నాగమణి, నాయకులు బాల్‌రెడ్డి, శ్రీహరి, ఖలీల్, శేఖర్, నాగులు, ఆరీఫ్, నోమన్, జమీర్ తదితరులు ఉన్నారు.



ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ తదితరులు

ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

బౌద్ధనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి శ్రీనివాస్‌నగర్‌లోని గిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని తెలంగాణ దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్ అన్నారు. ధార్మిక సలహాదారు గోవిందహరితో కలిసి శనివారం ఆలయాన్ని సందర్శించి ఆమె పూజలు చేశారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకు ముందు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

తిరుమలగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఓ పెళ్లి కోసం వేసిన టెంట్‌ను తొలగిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయాలపాలైన ఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై ఆంథోనమ్మ తెలిపిన వివరాల ప్రకారం రిసాలబజార్‌కు చెందిన లక్కీ(26) అదే ప్రాంతానికి చెందిన విజయ్, సంతోష్, మున్నా, జిష్ణు ఓ టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నారు. శుక్రవారం లోత్‌కుంట సరస్వతినగర్‌లో వివాహానికి వేసిన టెంట్‌ను తొలగించే క్రమంలో విద్యుత్ తీగలు తగిలాయి. ఈ ఘటనలో లక్కీ గాయాలపాలు కాగా విజయ్ సంతోష్, మున్నాకు స్వల్ప గాయాలయ్యాయి. లక్కీని స్థానికంగా ఉన్న బొల్లారం కంటోన్మెంట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే లోపునే మృతి చెందాడు. లక్కీ బతుకుదెరువు కోసం మహారాష్ట్ర నుంచి నగరానికి వచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం దహన సంస్కారాలు నిర్వహించారు.



సదస్సు ప్రారంభంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు, నిర్వాహకులు

అందరికీ సమాన హక్కుల కల్పనే లక్ష్యం

● తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : కుల, మత, ప్రాంత, లింగ బేధాలు లేకుండా మానవులందరికీ సమాన హక్కులను అందించడమే ప్రపంచ మానవ హక్కుల ఒడంబడిక లక్ష్యమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆ లక్ష్య సాధన దిశగా ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ (ఐఎన్‌హెచ్‌ఆర్‌పీసీ) ప్రజల మధ్య అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. ఓయూలోని మెకాస్టార్ ఆడిటోరియంలో ఐఎన్‌హెచ్‌ఆర్‌పీసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గౌరవ అతిథిగా హాజరైన ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ లా మాజీ డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా భారతీయులందరి హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు కొనసాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌హెచ్‌ఆర్‌పీసీ రాష్ట్ర అధ్యక్షుడు నవోదయ సిద్ధు, ప్రొఫెసర్ స్వామిదాస్, స్కైలాబ్ బాబు, క్రాంతికిరణ్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ లోన్ విషయంలో గొడవ..

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అన్నయ్యా ఆత్మహత్య చేసుకుంటున్నా, నా మృతదేహాన్ని స్వాధీనం చేసుకోండంటూ లోకేషన్ పంపించి రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గుండ్లపోచంపల్లి రైల్వేస్టేషన్ వద్ద చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా అల్లాదుర్గ్ గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన శ్రీరాములు కుమారుడు కమల్లి సందీప్(20) ప్రైవేటుగా డిగ్రీ చదువుతున్నాడు. అతడు హైదరాబాద్‌లో కొన్ని నెలలుగా పనిచేసి రెండు నెలల క్రితం తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. తన తల్లిదండ్రులతో గొడవ పడి బైకు కొనివ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని తరచూ బెదిరించడంతో సందీప్‌కు లోన్‌లో బైక్‌ను ఇప్పించారు. మొదటి వాయిదా సందీప్ చెల్లించిన తర్వాత రెండో వాయిదా తల్లిదండ్రులే చెల్లించారు. ఇక నుంచి నువ్వే ప్రతినెలా లోన్ చెల్లించుకోవాలని తల్లిదండ్రులు చెప్పడంతో చెల్లిస్తానని అన్నాడు. హైద్రాబాద్‌కు వెళ్లి పనిచేసుకుంటానంటే తండ్రి అతడికి వెయ్యి రూపాయలు ఇచ్చాడు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ వెళుతున్నానని చెప్పి బైకుపై గుండ్లపోచంపల్లి రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. పటాన్‌చెరులో ఉంటున్న చిన్నాన్న కుమారుడు వెంకట్‌కు ఫోన్ చేసి తాను రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నానని, నా మృతదేహాన్ని తీసుకెళ్లడంటూ లోకేషన్ పంపించిన కొద్దిసేపటికి ఆత్మహత్య చేసుకున్నాడు. కీ మ్యాన్ సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫోన్ చేసి గుండ్లపోచంపల్లి-మేడ్చల్ రైల్వేస్టేషన్ వద్ద ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం ఇచ్చాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు శనివారం ఉదయం ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. శనివారం ఉదయం ఫోన్‌లో మేసేజ్ చూసుకున్న సోదరుడు వెంకట్ స్నేహితులతో కలిసి లోకేషన్ వద్దకు చేరుకున్నాడు. అక్కడికి వెళ్లి చూడగా రైలు పట్టాల వద్ద సందీప్ చనిపోయి ఉండగా అదే సమయానికి పోలీసులు అప్పటికే అక్కడికి చేరుకున్నారు. బైక్ లోన్ విషయంలో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని రైల్వే పోలీసులు, కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.



మృతుడు సందీప్

అన్నదానం గొప్ప పుణ్యకార్యం: ఎమ్మెల్యే

● ఆలయాల్లో ఘనంగా అమావాస్య పూజలు

బోయినపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజలు, రైతులకు పొలాల అమావాస్య ఎంతో విశిష్టమైందని ఈ రోజున అన్నదానం చేయడమనేది పవిత్రమైన కార్యమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. పొలాల అమావాస్యను పురస్కరించుకుని శనివారం బోయినపల్లి తోకట్టలో గల కట్టమైసమ్మ ఆలయంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కాంతి, విట్టల్ రావు, విజయలక్ష్మి, వరప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు, బద్రీనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● అన్నదానం చేయడం ఒక గొప్ప పుణ్యకార్యమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. శనివారం అమావాస్యను పురస్కరించుకుని బోయినపల్లి బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయంలో జరిగిన పూజలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ హ్యూమన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ప్రకాష్ భాటియాలు హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో ఏర్పాటు చేసిన అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు ప్రేమ్ కుమార్, రామారావు, దుర్గయ్య, నర్సింహ్మా, నరేందర్, అజిత్, సాయి పంతులు తదితరులు పాల్గొన్నారు.



కట్ట మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, జంపన ప్రతాప్, మూపిడి మధుకర్

అడ్డగుట్టలో

తుకారాంగేట్‌లోని 160 ఏళ్ల చరిత్ర కలిగిన పహాడి హనుమాన్ ఆలయంలో ప్రతి అమావాస్య రోజున భక్తులకు అన్నదాన ప్రసాదం అందజేస్తామని ఆలయ చైర్మన్ మేకల లక్ష్మణ్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆలయంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ముఖ్య సలహదారుడు భరత్ కుమార్ ధర్మకర్తలు లలిత్ కుమార్, న్యూ క్లబ్ ఉపాధ్యక్షుడు వాలి ప్రసాంత్‌లతో పాటు భక్తులు ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో

బౌద్ధనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అమావాస్యను పురస్కరించుకుని శనివారం వారాసిగూడ చౌరస్తాలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెల అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారాసిగూడ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కురాకుల సుధాకర్, మాజీ అధ్యక్షులు బెలిదే నరసింహరావు, ప్రధాన కార్యదర్శి బొందుగుల రాజేశ్, కోశాధికారి మోద వీరశేఖర్, ప్రాజెక్ట్ చైర్మన్ వెంకటేశ్, దాతలు తిరువిది ప్రభాకర్, దాచేపల్లి వేణు, రాఘవేంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.